# కన్నీటి విలువ

\- శాంతి




సురేష్ మహోత్సాహంగా ఈల వేసుకుంటూ మెట్లన్నీ దిగేసి స్కూటర్‌ను స్టార్ట్ చేశాడు.

టైం ఆరున్నర అవుతూంది.

జాలీ ఫ్రెండ్స్ క్లబ్‌లో పార్టీ ఉంది. అందులో అతను మాట్లాడాలి. అంతేకాదు. గర్ల్ ఫ్రెండ్ వాణి అతని కోసం ఎదురు చూస్తూంటుంది.

వాణి అందాన్ని గుర్తు తెచ్చుకుంటూ స్టార్ట్ కాని స్కూటర్‌ను మరింత బలంగా తన్నాడు సురేష్.

"డాక్టర్! డాక్టర్!"

డబ్ డబ్ మంటున్న స్కూటర్ ధ్వని చీల్చుకుంటూ ఒక మృదువైన పిలుపు సురేష్‌కు విని పించింది.

అతనికి ఒక్కక్షణం చాలా భయం వేసింది.

ఎందుకంటే —

అతనిలోని 'డాక్టర్' ఆ పిలుపులోని ఆత్రతను వినగలుగుతున్నాడు.

సురేష్‌కు ఆ వినడం ససేమిరా ఇష్టం లేదు!

ఇలాటి పిలుపులు ఎన్నో వందలసార్లు విన్నాడు.

ఆ విన్న తరవాత ఇంకేం చేసేందుకు వీలు ఉండదు.

అది రాక్షసమైన పిలుపు. దాని నుంచి తప్పించుకోవడం కష్టం.

అందుకే అతను విననట్టు స్కూటర్‌ను ముందుకు పోనివ్వబోయాడు.

"ఆగండి, డాక్టర్! ఆగండి."

స్కూటర్ వెనక నుంచి వగురుస్తూ పిలుస్తున్న కంఠం ముందుకు వచ్చి హేండిల్‌ను గట్టిగా పట్టుకుంది.

ఎదురుగా పన్నెండేళ్ళ కుర్రవాడు.

తెల్లచొక్కా, ఖాకీలాగు వేసుకున్నాడు.

పసితనం జాలు వారుతున్న బుగ్గలు, అర్ధిస్తున్న కళ్ళు.

"డాక్టర్! మా అమ్మ పడిపోయింది, డాక్టర్!"

దీనంగా అంటున్నాడా అబ్బాయి.

సురేష్ గుండె జల్లుమంది.

అయింది. అయిపోయింది.

వీడింక కదలనివ్వడు.

తన పార్టీ ఏం కావాలి? తన స్పీచ్ ఏంకావాలి? తన వాణిని ఎలా విన్ కాగలడు?

వూహూ. వెళ్ళకూడదు.

ఎలాగన్నా వీడికి టోకరా ఇచ్చి తప్పించుకోవాలి.

"చూడు, బాబూ! నాకు అర్జెంట్ పనుంది... నేను రాలేను . . . . ఇంకెవర్నన్నా చూసుకో..."

మాట అయినా పూర్తి కాలేదు —

"మీరు వచ్చి తీరాలి, డాక్టర్! మా అమ్మ పడిపోయింది. ఇంట్లో ఎవరూ లేరు." ఖచ్చితంగా అన్నాడా అబ్బాయి.

"నిజమే, బాబూ! కాని, నాకు పని ఉందంటున్నానుగా? ఈ వీధి చివరలో ఇంకొక డాక్టరు ఉన్నాడు. అతన్ని వెళ్ళి పిలు — తప్పకుండా వస్తాడు."

ఉపకారం చెయ్యడమే తన ద్యేయమన్నట్టు చెప్పాడు సురేష్.

"ఆయన లేడు, సార్! నేను ముందక్కడ అడిగే మీ దగ్గరికి వచ్చాను."

ఆ కుర్రవాడు టపీమని జవాబిచ్చేయడంతో కొంత ముందుకు వచ్చింది సురేష్‌కు.

అసలే లేటు, అందులో వాణి ఎదురుచూస్తుంటుంది— వీడెవడు — మధ్యలో విధిలాగా అడ్డుకునేందుకు?

"సరే. అడ్రెస్ చెప్పు. రేపు వచ్చి చూస్తాను."

రాజీకి కొద్దిగా దిగి వచ్చాడు.

"ఇప్పుడే రావాలి, సార్!"

స్కూటర్ ఆపేశాడు కోపంగా సురేష్.

'ఏమిట్రా నీ దబాయింపు?'

అనబోయిన కంటాన్ని లోపల ఉన్న డాక్టర్




ఆపూర్వమైనది లిరిల్. పచ్చని తరంగరేఖలు. నిమ్మకాయల్లోని తాజాదనపు ఉత్సాహంతో. చురుకైన, పులకరింపజేసే లిరిల్ మిమ్మల్ని నవనారిగా రూపొందిస్తుంది.

**లిరిల్**
తాజాదనపు సబ్బు **నిమ్మకాయల తాజాదనపు ఉత్సాహంతో**

లింటాస్-LR.27-203 TL

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

ఆపేశాడు.

"ఏం జబ్బు మీ అమ్మకు?"

"తెలియదు, సార్!"

"ఇంట్లో ఎవరూ లేరూ?" తెలిసినా కావాలనే అడిగాడు.

"మా నాన్న ఇంకా ఆఫీసు నుండి రాలేదు, సార్! నేను స్కూల్ నుంచి ఇంటికి వచ్చినప్పుడు బాగానే ఉంది. గ్రౌండ్‌కు వెళ్ళి ఆడుకుని వచ్చే సరికి అమ్మేమో ఉలక్కుండా పడిపోయి ఉంది."

నా ప్రాణం తీసింది — అనుకున్నాడు సురేష్.

ఇనీషియల్ స్టేజిలో ఉన్న కేస్‌కు అటెండ్ కావాలంటే అప్పుడే తిరిగి వచ్చేయడం కుదరదు.

కాబట్టి, పార్టీకి వెళ్ళడం కుదరదు.

కాని, అతననుకున్నది—

పార్టీకి వెళ్ళి తీరాలి. ప్రసంగించి తీరాలి.

వాణితో డాన్స్ చేసి తీరాలి.

ఏదీ జరగనీయదెందుకు విధి?

తీక్షణంగా ఎదుట ఉన్న అబ్బాయిని చూశాడతను.

"నువ్వెళ్ళి మీ నాన్నని పిలుచుకో, బాబూ! ఆయన వచ్చి చూసుకుంటాడు."

"నాకు మా నాన్న ఆఫీస్ దారి తెలియదు, సార్!" బాధగా చెప్పాడా అబ్బాయి.

"ఇంకేం తెలుసు? మా వీధి దారి తెలుసా? నా స్కూటర్ ముందు దిష్టిబొమ్మలా నిలుచోవడం తెలుసా? నేను రానయ్యా. రావేరాను. అర్జెంట్‌గా పని ఉంది. నేను వెళ్ళాలి."

ఆగిపోయిన స్కూటర్‌ను డిటర్మిన్డ్‌గా ఒక్క తన్ను తన్నాడు.

స్కూటర్ స్టార్ట్ కావడం—

బొమ్మలా నిలుచున్న అబ్బాయి కళ్ళలో టపటపా నీళ్ళు కారడం ఒక్కసారే జరిగింది.

వెళ్ళి పోవాలనుకున్న సురేష్ ఆ దృశ్యాన్ని చూసి అలాగే ఆగిపోయాడు.

కొద్దిగా చినిగిన చొక్కాతో కన్నీళ్ళు తుడుచుకుంటూ, 'రాలేవూ?' అన్నట్టు దీనంగా చూశాడా అబ్బాయి.

ఆ చూపుతో సురేష్‌కు గుండె నెప్పి వచ్చేసింది.

ఆ అబ్బాయి కన్నీళ్ళ ముందు వెళ్ళవలసిన పార్టీ, ఇవ్వవలసిన స్పీచి, వాణితో డాన్సూ, చివరికి ప్రపంచం కూడా చిన్నదిగా కనుపించిం దతనికి.

స్కూటర్ దిగి మళ్ళీ పైకి వెళ్ళి మెడికల్ కిట్ పట్టుకు వచ్చాడు.

"ఎక్కు" అంటూ తనవెనక కూర్చో పెట్టుకుని, 'కొట్టవలసిన చోటే కొట్టాడు' అని తిట్టుకున్నాడు సురేష్.

• • •

మంచం మీద పడి మూలుగుతూంది పేషెంటు.

"డాక్టర్! మా అమ్మ." కుర్రవాడు చూపించాడు.

సురేష్ క్లబ్‌లో తిరుగుతున్న మనసును బలవంతంగా తిప్పి పేషెంటు వైపు మళ్ళించాడు.

నాడి పట్టి చూసి గట్టిగా ఊపిరి పీల్చాడు.

బతికి ఉంది. అది చాలు అనుకుని ఆవిడ మొహంలోకి చూశాడు.

తెలిసిన మనిషి. ఎవరబ్బా?

రెండు నిమిషాలు ఆలోచించాక గుర్తుకు వచ్చిం దతనికి—సావిత్రి!

ఏలూరులో ఒకప్పుడు తమ పక్క ఇంటి పిల్ల. సురేష్ కళ్ళ ముందు ఒక్క క్షణం గతం కదలాడింది. అతని కప్పుడు పద్ధెనిమిది ఏళ్ళు.

యువ్వనంలోకి అడుగు పెట్టాక ఏదో ఒకటి చెయ్యాలనిపించేది.

అందుకు చక్కగా వాళ్ళ ఇంటినీ, సావిత్రి వాళ్ళ ఇంటినీ కలిపే పాత కాలపు కిటికీ ఒకటి అతనికి ఆధారంగా ఉండేది.



సి. హ మధ్యమ నిరీక్షణ

ఫోటో— ఎస్. శివశంకరయ్య (శ్రీశైలం)

సావిత్రిని (పాపం) ఇంట్లో కదలనిచ్చే వాడు కాదు. ఇంటి బయటున్నా స్వేచ్ఛగా తిరగనిచ్చే వాడు కాదు. వాచ్ డాగ్ లాగ నిరంతరం చూపులతో ఆమెను వెంటాడే వాడు.

సుప్రసిద్ధ సినిమా విరహ గీతాలన్నీ అర్ధరాత్రి వరకూ కిటికీ పక్క నుంచీ కీచుగా పాడి ఆమెను బోరుకొట్టేవాడు. అతను చదివిన తెలుగు నవలలు నుండి వ్రాయగలిగినన్ని లవ్‌లెటర్స్‌ను కాపీ చేసి కిటికీ గుండా పోస్ట్ చేసేవాడు.

చివరి కొకనాడు చీకట్లో పెరట్లో ఆమె చెయ్యి పట్టుకోబోయి, ముద్దు పెట్టుకోబోయి చెంప దెబ్బ తిన్నాడుకూడా.

విధి! విధి! తిట్టుకున్నాడు సురేష్.

వాణితో డాన్సు చెయ్యాలనుకున్న సాయంత్రం సావిత్రి హెల్ప్ చూడవలసి వచ్చింది.

గది చుట్టూ చూశాడు.

ఇంటి పరిస్థితులు చాలా పూర్‌గా కనుపిస్తున్నాయి.

సావిత్రి ఎప్పుడూ పూర్ గర్లే!

ఆమె కెప్పుడేం ఉందనీ?

కొంచెం తీవ్రమైన ఆనాటి తన ప్రేమలో నిజాయితీ ఉందని ఆమె కేం తెలుసు?

నోట్లో వేలు వేసుకుని తన కేసి కృతజ్ఞతా భావంతో చూస్తూ నిలబడ్డ బాబును—

"నీళ్ళు తీసుకురా" అని సైగ చేశాడు సురేష్.

సావిత్రికి ఇంజెక్షన్ ఇచ్చి ఆమెకు స్పృహ వస్తుందేమోనని చూస్తూ పక్క కుర్చీలో కూర్చున్నాడు.

కొంత సేపటికి సావిత్రి కళ్ళు తెరిచింది.

"బుజ్జీ!"

"అమ్మా!" మంచాని కంటుకున్నాడు కుర్రవాడు.

"ఎక్కడికి వెళ్ళావురా?"

"ఇక్కడే ఉన్నానమ్మా."

"నాన్నేడీ?"

"ఇంకా రాలేదు."

"మరెవ రా వచ్చింది?"

"డాక్టరమ్మా."

సావిత్రి మెల్లగా కళ్ళు తిప్పి సురేష్ కేసి చూసింది.

కుర్చీలో ఇబ్బందిగా కదులుతూ మొహమాటంగా నవ్వాడు సురేష్.

మర్యాదగా చూస్తుం దనుకున్న సావిత్రి కళ్ళలో కోపచ్ఛాయలు కనుపించగానే అదిరిపడ్డాడు.

బాస్రే! ఈవిడ ఇంకా పాస్ట్‌ను మరవలేదన్నమాట.

ఆవిడ మరవకుంటే తను మాత్రం మరుస్తాడా?

"నువ్వా?!" సావిత్రి హీనస్వరం.

"నేనే." సాదరంగా నవ్వాడు సురేష్.

"ఇక్కడి కెలా వచ్చావ్?"

మంచంమీద పడుకున్నదల్లా మెల్లగా లేచి కూర్చుని తీక్షణంగా ప్రశ్నించింది.

పాపం! ఇంజెక్షన్ పనిచేసింది తన వల్లనని తెలియదుగా?

"అదిగో! మీ బుజ్జే తీసుకు వచ్చాడు."

సావిత్రి కోపమంతా ఈ సారి కొడుకు మీదికి మళ్ళింది.

"మరే— నువ్వు మాటాడకుండా పడిపోయావు. అందుకని ..."

"ఆఁ. అందుకనీ ..." రెట్టించింది సావిత్రి.

"డాక్టర్ని తీసుకువచ్చానమ్మా."

ఏమీ తెలియని బుజ్జి అమాయకంగా జవాబియ్యడంతో ఆపుకోలేనంత నవ్వు వచ్చింది సురేష్‌కు.

"అయిలే, సావిత్రీ, నువ్వేం మారలేదన్నమాట. అప్పుడెంతో — ఇప్పుడూ అంతే. అయినా నేనేం చేస్తానని నీ భయం? డాక్టర్‌గా వచ్చాను. నేను ఇంజెక్షనిస్తే లేచి కూర్చుని నన్నే తిడుతున్నావు— ఇదేమన్నా బాగుందా?"

అతన్నీ, ఆకని నవ్వునూ, స్టైల్ చూపుకుంటూ

పరిహాసంగా అతనన్న మాటల్ని ఏ మాత్రం సహించ లేక పోయింది సావిత్రి.

"ముందు నువ్విక్కడి నుంచి వెళ్ళు." గర్జించి నట్టుగా అంది.

"వెళతాలే. నేనేం మీ ఇంట్లో కూర్చోవాలని రాలేదు. మీ బుజ్జి ఏడుస్తూంటే వచ్చాను. చూడు నీకు నెర్వస్ వీక్నెస్ ఉంది. కష్టాలతో వంట చెయ్యకు ... నేను చూశాలే మీ ఇల్లంతా. గాస్ కొనిపించు మీ ఆయనతో చెప్పి. లేకుంటే నీకే నష్టం. ఇదిగో — ఈ కాప్సూల్స్, టానిక్సూ మరిచిపోకుండా తెప్పించుకో. ఈ సారి ఎక్కడన్నా కనుపిస్తే ఇంకా గట్టిగా అరుస్తావు."

మందుల చీటీ వ్రాసి, దాన్ని సావిత్రి మంచం మీద ఉంచి లేచి నిలబడ్డాడు సురేష్.

"నువ్వుకాని, నీ మందులుకాని నా కక్కర్లేదు."

సావిత్రి ప్రిస్క్రిప్షన్ను ముక్కలుగా చించేసి వెళ్ళిపొమ్మన్నట్టు గుమ్మంకేసి చూసింది.

సురేష్‌కు కోపం ముంచుకొచ్చింది. తీవ్రంగా ఏదో అనబోయి ఆగిపోయాడు.

అతని దృష్టి జరిగేదేమీ అర్థం కాక అప్రతిభుడై అతని కేసి, వాళ్ళమ్మకేసి మార్చి మార్చి చూస్తున్న బుజ్జి మీద పడింది.

పార్టీని, వాణిని వదిలిన కారణం — వీడు.

సావిత్రి తిట్లకూ, తిరస్కారాలకూ కారకుడు వీడు. మండిపడ్డట్టు బుజ్జికేసి చూసి కిట్ పట్టుకుని గబగబా ఇంటి అవతలికి వచ్చేశాడు సురేష్. మెట్ల దగ్గర ఇంకొక షాక్.

కోపంతో, భాషలేని బాధతో మెట్లు దిగుతున్న సురేష్— అదే మెట్లెక్కుతున్న మరొక ఆగంతు కునికి డాష్ ఇచ్చాడు.

"అయాం సారీ!"

ఆ వచ్చినతను, సావిత్రి భర్త కాబోలు— తల రాచుకుంటూ సురేష్ కేసి చూశాడు.

చచ్చాననుకున్నాడు సురేష్ మనసులో.

అతను — రఘు.

సురేష్‌కు ఉన్న శత్రువుల్లో రఘు ఫస్ట్ కాటగిరీకి చెందుతాడు.

"నువ్వు — సురేష్‌వి కదూ?" రఘు భ్రుకుటి ముడిచి అడిగాడు.

"నువ్వు రఘువి. అవునా?"

"నువ్వు మా ఇంటికి ఎందుకు వచ్చావ్? సావిత్రి నీకు తెలుసా?"

రఘు గొంతులో లక్షన్నర అనుమానాలు.

ఎప్పుడో కాలేజీ ఎలెక్షన్స్‌లో రఘు, సురేష్ రైవల్స్. ఇంకా రైవల్సే!

ఎంత రైవలైనా అనుమానించి అవమానించ డాల్లో సావిత్రికి రఘు తగిన భర్త అని లోపల సంతోషపడ్డాడు సురేష్.

అతను వాళ్ళ ఇంటికి ఎందుకు వచ్చాడో చెప్పే లోపల — వెనక నుంచి బుజ్జి వచ్చి —

"నాన్నా! నాన్నా! అమ్మ సాయంత్రం మాటాడ కుండా పడిపోయింది. నేను వెళ్ళి ఈ డాక్టర్‌ను పిలుచుకు వచ్చాను" అన్నాడు ఉత్సాహంగా.

పాపం! బుజ్జి చేసిన పని అటు వాళ్ళమ్మకూ, ఇటు వాళ్ళ నాన్నకూ నచ్చలేదు.

సురేష్ సంగతి చెప్పక్కర్లేదు.

రఘు వాడికేసి క్రూరంగా చూస్తూ కసిరాడు.

"బుద్ధి ఉండక్కర్లే, వెధవా! ఎవర్నంటే వాళ్ళను పిలుచుకు వచ్చేయడమే? పీపు చీరేస్తాను —ఇలాంటి పనులు ఇంకోసారి చేశావంటే."

అని సురేష్ కేసి తిరిగి —

"యూ ప్లీజ్ గెటవుట్ ఫ్రమ్ హియర్!" అనేసి లోపలికి వెళ్ళిపోయాడు.

అనవసరమైన ఆ అవమానాన్ని మౌనంగా భరిం చడం తప్ప చెయ్యగలిగే దేమీ కనిపించలేదు సురేష్‌కు.

సాయంత్రం పూట —

'ఎటువంటి కేస్ దొరికింది! ఏనాటి మనుషుల్ని చూశాను!' అని తిట్టుకుని తల విదిలించుకున్నాడు.

పార్టీకి ఆలస్యంగానైనా సరే — వెళ్ళిపోతే బాగుండు ననుకుంటూ స్కూటరు ఎక్కాడు.

వెళ్ళిపోబోయే ముందు ఎందుకో ఒకసారి వెనక్కు తిరిగి సావిత్రి కమ్ రఘు వాళ్ళింటికేసి చూసి, అక్కడ ఉన్న దృశ్యం చూసి విభ్రాంతపోయాడు సురేష్.

బుజ్జి ఇంటి ముందు ఉన్న స్తంభంకేసి స్తబ్దంగా చేరబడి నిలిచి వెళ్ళిపోతున్న అతనికేసి అసహాయంగా చూస్తున్నాడు.

ఆ అబ్బాయి కళ్ళలో మహా సముద్రాలు ఉప్పొంగుతున్నాయి. ఆ సముద్రాలు లోతు కందని కథలెన్నో చెపుతున్నాయి సురేష్‌కు.

ఆ కన్నీళ్ళ కెంత విలువ ఉంది?

ముందు వాళ్ళమ్మను చూసేందుకు రానన్నందుకు అసహాయంగా ఏడ్చాడు!

ఇప్పుడు అతను అగౌరవింపబడి వెళుతున్నాడని అలాగే ఏడుస్తున్నాడు!

అది చూసిన సురేష్ హృదయం చల్లబడింది.

సావిత్రినీ, రఘునూ మరిచిపోయాడు.

స్కూటర్ దిగి—

"జీవితం అంతేరా, బాబూ! నువ్వనుకున్నది అనుకున్నట్టు జరగదు. అనుకోనిది ఏదో జరిగినా అది నీకు వద్దు అదే విధి" అని చెప్పి ఆ కన్నీళ్ళు తుడుద్దా మనుకున్నాడు.

అయితే — ఆ చిన్న పిల్లవాడితో అంతంత పెద్ద మాటలు దేనికని స్కూటర్ స్టార్ట్ చేసి క్లబ్ కేసి దారి తీశాడు. *


## సాంకేతిక విజ్ఞాన గ్రంథములు

విశ్రాంతి సమయంలో ఇంట్లోనే వుండి అయా పనిముట్లను సరిచేసుకునే వారికి, విద్యా సంస్థలలో చేరి విద్యనభ్యసించేవారికి, వివిధ సంస్థలలో పని చేసుకునేవారికి అతి సులభముగా అర్థమయేటట్లు చిత్రాలతో వివరించివున్నాము. ప్రతి ఇంటా వుండి అందరికీ ఉపయోగపడే ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. | | వెల రూ |
|---|---|---|---|
| ట్రాన్సిస్టర్ రిపేరింగ్ | 3-50 | వాల్వు రేడియో రిపేరింగ్ | 10-00 |
| ట్రాన్సిస్టర్ రేడియో | 3-50 | టేప్ రికార్డర్ | 5-25 |
| హౌస్ వైరింగ్ | 5-75 | టి.వి. మెకానిజం | 5-25 |
| మోటార్ రీవైండింగ్ | 5-25 | మోటార్ మెకానిజం | 6-00 |

మీరు పుస్తకాలకు ఆర్డర్ వేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue

Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014